సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీపీ వెంటే మేమంతా

వైఎస్సార్‌సీపీలో చేరికలు పెరుగుతున్నాయి. విపక్షాల నుంచి వచ్చి చేరుతున్నారు.

- 8లో



బంగారం కోసం హత్య..?

అమలపాడులో ఓ వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతి చెందారు. బంగారం కోసం చంపేసినట్లు అనుమానిస్తున్నారు.

- 8లో

రూ.1,21,000 నగదు సీజ్

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శనివారం నిర్వహించిన తనిఖీల్లో ఓ కారులో తరలిస్తున్న రూ.1,21,000 సొమ్మును సీజ్ చేశారని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది శనివారం మున్సిపాలిటీ పరిధి ఏస్‌పేట ఫైర్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. ఒడిశా జయంతిపురం గ్రామానికి చెందిన ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ యజమాని సురేష్‌కుమార్ సాహు తన కారులో ఎలాంటి పత్రాలు లేకుండా ఈ సొమ్మును తీసుకెళ్తుండగా గుర్తించి సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

న్యూస్‌రీల్

రానున్న రెండు వారాలు కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు రానున్న రెండు వారాలు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ అధికారి శేఖర్ విద్యార్థి సూచించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల పరిశీలకులుగా తాము జిల్లాకు వచ్చినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి ముగ్గురు ఎన్నికల పరిశీలకులు, మరో ఇద్దరు పరిశీలకులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నోడల్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. రానున్న రెండు వారాలు కీలకమని ఆయన తెలిపారు. మద్యం విక్రయాలు, అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలన్నారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. సాధారణ పరిశీలకులు శేఖర్ విద్యార్థి, సందీప్ కుమార్, పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, పోలీసు పరిశీలకులు సచింద్ర పటేల్, దిగంబర్ పి.ప్రధాన్ లకు ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ, జిల్లాలో పోలీసు బందోబస్తు, నిఘా బృందాలు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

ఉద్దానంలో ప్రఖ్యాత కిడ్నీ పరిశోధకురాలి పర్యటన




పెద్దమురహరిపురంలో రక్త నమూనాల సేకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న అన్నా అసిటునో

వజ్రపుకొత్తూరు: యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా నుంచి ప్రఖ్యాత కిడ్నీ వ్యాధి పరిశోధకురాలు, పర్యావరణ, ఆరోగ్య నిపుణురాలు అన్నా అసిటునో శనివారం ఉద్దానంలో పర్యటించారు. ఉద్దానం ప్రాంతంలోని పెద్దమురహరిపురం, రంగోయి ప్రాంతాల్లో పర్యటించిన ఆమె ఈ ప్రాంతంలో ప్రస్తుతం పరిశోధనలు చేపడుతున్న జార్జి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ కార్యకలాపాలను నిశితంగా పరిశీలించారు. కిడ్నీ వ్యాధి, దాని ప్రభావ ప్రాంతాల్లో రక్త నమూనాల సేకరణ ప్రక్రియను గమనించారు. అనంతరం ఆమె పలాసలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అత్యాధునిక కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించారు. కిడ్నీ వ్యాధులకు చేపడుతున్న ట్రీట్‌మెంట్, డయాలసిస్ వ్యాధిగ్రస్తుల స్థితి గతుల గురించి ఆస్పత్రి నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాకేష్‌తో చర్చించారు. జన్యు, బయోమార్కర్ల విశ్లేషణ చేస్తున్నారని అన్నా అసిటునోకు డాక్టర్ రాకేష్ వివరించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ గుమ్మడి, డాక్టర్ కవిత యాదవ్, డాక్టర్ దిలీప్‌కుమార్, సత్యన్నారాయణ, ప్రవీణ్, తమ్మినాన దుర్యోధనరావు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా వస్తుందంటే దేన్నీ వదలరు కొందరు ప్రబుద్ధులు.. తెలుగుదేశం నాయకులు వారినే మించిపోయారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో ప్రజల ఇళ్ల నిర్మాణాలకు ఇసుక ఉచితం అని చంద్రబాబు సర్కారు ఆర్భాటంగా ప్రకటించి.. ఆ ముసుగులో ఎక్కడికక్కడ తమ పార్టీ నాయకులు ప్రజలకు అందాల్సిన ఇసుకను దోచుకుని.. మళ్లీ ఆ ప్రజలకే అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకునేందుకు లైసెన్స్ ఇచ్చేసింది. ఇంకేముంది.. జిల్లాలో అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి తదితర పచ్చబ్యాచ్ ఇసుక అక్రమాలకు గేట్లు తెరిచేశారు. నాగావళి, వంశధార, బాహుదా, మహేంద్రతనయ నదీ గర్భాలను సైతం సామాన్య ప్రజల ముసుగులో తమ అనుచరగణంతో కుళ్లబొడిపించేశారు. రాత్రింబవళ్లు యథేచ్ఛగా తవ్వేసి అధిక ధరలకు అమ్ముకోవడం ద్వారా కోట్లకు కోట్లు వెనకేసుకున్నారు.

- సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం



ఇసుక ఉచిత దోపిడీ పథకం

టీడీపీ నేతలకే ప్రత్యేకం

నాడు
- ఐదేళ్ల పాటు నదీ గర్భాలను విచ్ఛిన్నం చేసిన పచ్చ మాఫియా
- ఉచితం ముసుగులో ఇసుక హాంఫట్
- కోట్లు కొల్లగొట్టిన అచ్చెన్న, కూన
- ఉన్నఫలంగా కోటీశ్వరులైన టీడీపీ నాయకులు

నేడు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రణాళికాబద్ధంగా విక్రయాలు
- ప్రభుత్వానికి భారీ ఆదాయం
- వచ్చిన ఆదాయంతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు




ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడపేట రీచ్‌లో అక్రమ తవ్వకాలు (ఫైల్)

టీడీపీ హయాంలో.. నాగావళి, వంశధార, మహేంద్ర తనయ, బహుదా.. నది ఏదైనా టీడీపీ 2014–19 ఐదేళ్లలో ఇసుక దోపిడీ చేసింది. ఆ నాయకులు ఉచిత ఇసుక విధానంతో ప్రజలను మోసగించి ఎక్కడికక్కడ ర్యాంపులను అడ్డాగా చేసుకుని వందల కోట్ల రూపాయలను దోచుకున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో పర్యావరణానికి విఘాతం కలగకుండా, నదులు నాశనం కాకుండా, నీటి వనరులు దెబ్బ తినకుండా నిర్దేశిత ఇసుక ర్యాంపులకు అనుమతిచ్చి, ఇసుక తవ్వకాలు జరిపించి, తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

తేడా ఇదిగో..
టీడీపీ హయాంలో ఇసుకతో ఆ పార్టీ నాయకులు లాభ పడ్డారు. ఉన్న ఫలంగా కోట్లకు పడగలెత్తారు. సైకిల్ మీద వెళ్లేవాడు కారుపైన, కార్లపై వెళ్లేవాడు పెద్ద పెద్ద భవనాలు కట్టుకునే స్థాయికి వెళ్లిపోయారు. అదే వైఎస్సార్‌సీపీ హయాంలో వస్తే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. ఆ డబ్బుతో పేదలకు సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది.

టీడీపీ అధికారంలో ఉండగా..
టీడీపీ అధికారంలోకి వచ్చిన తొలి నెల నుంచి ఇసుక స్వాహా ప్రారంభమైంది. తొలి రెండేళ్లు 23 ఇసుక ర్యాంపులను డ్వాక్రా సంఘాలకు అప్పగించింది. ఆన్‌లైన్‌లో చలానా చెల్లించి, రశీదు ర్యాంపుల్లో చూపిస్తే వాహనంలో ఇసుక లోడింగ్ చేసేవారు. ఈ విధంగా ర్యాంపుల నిర్వహణ సేవలు అందించినందుకు డ్వాక్రా సంఘాలకు ఇసుక విక్రయం ద్వారా వచ్చిన ఆదాయంలో 25శాతం ఇస్తామని టీడీపీ ప్రకటించింది. అలాగే, మరో 25శాతం సొమ్ము స్థానిక రైతుల సంక్షేమానికి వినియోగిస్తామని చెప్పింది. కానీ ఇవేవీ జరగలేదు. డ్వాక్రా సంఘాల ముసుగులో టీడీపీ నాయకులు, వారి అనుచరులే రీచ్‌లను నిర్వహించి సొమ్ము చేసుకున్నారు ఇసుక ధరలు పెంచేసి దోచుకున్నారు.



ధరలు పెరగడంతో భవన నిర్మాణ కార్మికులు ఆందోళనకు దిగిన పరిస్థితి చోటు చేసుకుంది. ఈ పరిస్థితుల్లో టీడీపీ ప్రభుత్వం ఇసుక ర్యాంపుల నిర్వహణ బాధ్యతను డ్వాక్రా సంఘాల నుంచి తప్పించి 2016 ఏప్రిల్‌లో ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చింది. ఎవరికి అవసరమైనా నదికి వెళ్లి ఇసుక తీసుకోవచ్చని చెప్పింది. కానీ, ఆ విధానం అమలు కాలేదు. ఉచితం ముసుగులో టీడీపీ నాయకులు ర్యాంపులను గుప్పెట్లో పెట్టుకున్నారు. నచ్చినట్టుగా ధర పెట్టి ఇసుకను అమ్మేసి, ఆ సొమ్మును మింగేశారు. నదులనే కాదు థర్డ్ ఆర్డర్ స్ట్రీమ్ కింద వాగులు, వంకలను కూడా కొల్లగొట్టారు.

రూ.1500 కోట్లకు పైగా దోపిడీ

- అధికారంలో ఉన్నంత కాలం నదులనే కాదు వాగులు, వంకలను కూడా వదల్లేదు. రూ. 1500కోట్లకు పైగా టీడీపీ నేతలు ఆర్జించారన్న ఆరోపణలు ఉన్నాయి. నాగావళి, వంశధార, మహేంద్రతనయ, బాహుదా నదులు టీడీపీ హయాంలో ఎంత బక్కచిక్కిపోయాయో అందరికీ తెలుసు. టీడీపీ ప్రభుత్వం ఘనంగా ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానం సామాన్యులకు ఉపయోగపడలేదు గానీ టీడీపీ నేతలకు మాత్రం కోట్లు కురిపించాయి.



మబగాంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు (ఫైల్)

నేటికీ గుర్తుకొచ్చేలా సాగిన అక్రమాలు
- 2014మే 14వ తేదీన టీడీపీ ఇసుక మాఫియా రెచ్చిపోయింది. ఇసుక దందా నియంత్రణకై నియమించిన వీఆర్‌ఓలపై దాడి చేసింది. నైరాలో జరిగిన ఈ ఘటనలో చంద్రశేఖర్, విశ్వేశ్వరరావు,చంద్రభూషణ్‌కు తీవ్రగాయాలయ్యాయి.
- నరసన్నపేట మండలం లుకలాంలో 2016లో అక్రమ ఇసుక తవ్వకాలు, ఇసుకను గుర్తించిన నాటి ఆర్డీఓ దయానిధి, డీఎస్పీ భార్గవనాయుడు, అప్పటి మైన్ ఏడీలు లుకలాం మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు చేసేందుకు యత్నించగా, నాటి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అడ్డుకున్నారు.
- ఎచ్చెర్ల తమ్మినాయుడుపేట, ముద్దాడపేట, పొన్నాడలో అనధికార ఇసుక ర్యాంపులు నడిచాయి. నాటి జెడ్పీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, నాటి మంత్రి కళా వెంకటరావు మధ్య వివాదం కూడా నడిచింది. ఇసుక ర్యాంపుల్లో వాటాల గురించి టీడీపీ నేతలు గొడవకు దిగిన సందర్భాలు ఉన్నాయి.
- శ్రీకాకుళం రూరల్ మండలం పరిధిలోని పొన్నాం –బట్టేరు ఇసుక ర్యాంపుల నిర్వహణలో అచ్చెన్నాయుడు అనుచరులు దందా చేశారన్న వాదనలు ఉన్నాయి. శ్రీకాకుళం రూరల్ బట్టేరు వద్ద అయితే ఇసుక అక్రమాలను అడ్డుకున్నందుకు గ్రామ రెవెన్యూ అధికారులపై టీడీపీ నాయకులు దాడి చేశారు. కల్లేపల్లి, భైరి ర్యాంపుల్లో టీడీపీ నేతల ఆగడాలు తెలిసిందే.
- నేనే రాజు–నేనే మంత్రి అని కింజరాపు అచ్చెన్నాయుడు, ఇసుక వ్యవహారంలో బిగ్‌బాస్‌గా కూన రవికుమార్ పేరు పొందారు. వీరిద్దరూ కలిపి చేసిన ఇసుక దందా రూ.వేల కోట్లు దాటిపోయింది. మంత్రి హోదాలో అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్‌గా కూన రవికుమార్ కనుసన్నల్లోనే ఇసుక అక్రమాలు భారీగా సాగాయి.
- నరసన్నపేట మండలం మడపాంలో రోజుకి వందలాది లారీల ద్వారా విశాఖకు అక్రమంగా ఇసుక తరలించారు. జాతీయ రహదారిపై ప్రయాణించిన ప్రతి ఒక్కరికీ రోడ్డుపై వందలాది లారీలు కనిపించేవి.
- గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ మంత్రి అనుచరులు కూడా ఇక్కడికొచ్చి ఇసుక దందా చేశారు.
- ఆమదాలవలస నియోజకవర్గం పురుషోత్తపురం ఇసుక ర్యాంపులోకి కూన రవికుమార్ అండ్‌కోకు చెందిన 25 లారీలతో పాటు నాలుగు జేసీబీలు అక్రమంగా వెళ్లి వరద పోటుకు మునిగిపోయాయి. రాత్రి వేళల్లో నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి తవ్వకాలు చేస్తుండగా వరదముంపునకు గురయ్యారు.



పురుషోత్తపురంలో నదిలో చిక్కుకున్న లారీలు (ఫైల్)

వాల్టాకు తూట్లు

జిల్లా శాండ్ కమిటీ పర్యావరణ అనుమతులున్న రీచ్‌ల నుంచే ఇసుకను తవ్వాల్సి ఉన్నా అనుమతులతో సంబంధం లేకుండా, పర్యావరణ చట్టాలకు, నిబంధనలకు తూట్లు పొడుస్తూ టీడీపీ నాయకులు నదుల్లో కాసుల వేట సాగించారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ నదుల్లో ఇసుక తవ్వకాలు జరపకూడదని నిబంధనలు ఉన్నా అర్ధరాత్రి నుంచి తెల్ల వారు జాము వరకూ తవ్విపారేశారు. వంతెనలకు, ఇరిగేషన్ పంపులు, వాటర్ ఫిల్టర్ సంపులకు 500మీటర్లు దూరంలో ఇసుక తవ్వకాలను చేపట్టాలి. కానీ నిబంధనలు ఎక్కడా పట్టించుకోలేదు. రీచ్‌ల వద్ద లారీకి రూ. 6వేల నుంచి 10వేల వరకూ వసూలు చేసిన దాఖలాలు ఉన్నాయి.

ఎక్కడెక్కడ ఎలా అంటే..?
- ఆమదాలవలస నియోజకవర్గంలోని ఇసుక ర్యాంపుల్లో నాటి ఎమ్మెల్యే కూన రవికుమార్ బంధువులు, అనుచర గణం పాత్ర అందరికీ తెలిసిందే. సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం ఇసుక ర్యాంపు కూన రవికుమార్‌కు బంగారు గని మాదిరిగా ఉపయోగపడిందని అప్పట్లో జిల్లా కోడై కూసింది. 90 రోజుల కాలంలో రూ.10కోట్లు వరకు ఆర్జించారని అప్పట్లో విపరీతమైన చర్చ నడిచింది. పోతయ్యవలస ర్యాంపు వద్ద నిబంధనలకు విరుద్ధంగా నదిలోనే లారీలు రాకపోకలు సాగించాయి. పురుషోత్తపురం ర్యాంపు వద్ద ఇసుక కోసం వందల సంఖ్యలో లారీలు బారులు తీరిన సందర్భాలుండేవి. ఆమదాలవలస మండలం దూసి రైల్వే వంతెన సమీపంలో నాగావళి నదిలో ఇసుక తవ్వకాలు జరిపిన దాఖలాలు ఉన్నాయి.
- పొందూరు మండలం సింగూరు పేరుతో అనుమతులు ఇచ్చిన ర్యాంపును చూపించి నాగావళికి అవతల ఇసుక తవ్వేసి దూసి గ్రామం మీదుగా అక్రమ రవాణా చేయించారు. ఆమదాలవలస మండలంలోని నిమ్మ తొర్లాడ, జీకేవలస, కొత్తవలస, దూసిపేట, ముద్దాడపేట, తొగరాం, గోపినగర్ ప్రాంతాల్లో కూడా ఇసుకను అక్రమంగా దోచుకున్నారు. విశాఖ అవసరాల పేరుతో ఇసుక మాఫియాను ప్రోత్సహించి, పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడ్డారు.



వంశధారలో ఇసుక తరలించిన ఒక ప్రదేశం (ఫైల్)

- నరసన్నపేట నియోజకవర్గంలోని మడపాం తదితర ర్యాంపుల్లో నాటి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అనుచరులు భారీగా వసూళ్లు చేశారు. నరసన్నపేట, జలుమూరు, పోలాకి మండలాల్లో వంశధార నదికి ఆనుకుని ఉన్న ఇసుకను టీడీపీ నేతలు బంగారు బాతుగా మింగేశారు. గోపాలపెంట, మడపాంలో జన్మభూమి కమిటీ సభ్యులు, నాటి ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున దందా నడిపారు. గోపాలపెంట, మడపాం, చేనులవలస, బుచ్చిపేటలో అనధికారిక ర్యాంపు నిర్వహించి బగ్గు రమణమూర్తి పెద్ద ఎత్తున లబ్ధి పొందారు.
- పాతపట్నం నియోజకవర్గంలో వంశధారలో మేట వేసిన పొనుటూరు, మాతల వద్ద అక్రమ తవ్వకాలు జరిగాయన్నది అందరికీ తెలిసిందే. పొలాల్లోని ఇసుక తొలగించి అమ్ముకునేందుకు అనుమతి కావాలని రైతుల పేరుతో కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవడం, అధికారం అండతో అనుమతులు పొంది పొలాల్లోని మేటను వదిలేసి ఇసుకను అక్రమంగా తోడేసిన దాఖలాలు ఉన్నాయి. వంశధార రిజర్వాయర్ నిర్మాణ అవసరాల పేరిట హిరమండలంలోని భగీరథపురం, పిండ్రువాడ, అక్కరాపల్లి, అంబావలి, రుగడ కొమనాపల్లి తదితర గ్రామాల నుంచి ఇసుకను బహిరంగంగా తరలించారు.
- బాహుదా నదిలో నిషేధిత ప్రాంతాలన్నింటిలోనూ ఇసుకను ట్రాక్టర్లతో తరలించారు. రోజుకి సగటున 1000 ట్రాక్టర్ల వరకు ఇసుక తరలించారు. ఇవన్నీ స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ అండదండలతోనే జరిగాయి.

అన్నమాటపై.. అచంచల విశ్వాసం

ప్రతి గళమున అదే నమ్మకం. ప్రజల గుండెల్లో అదే విశ్వాసం. జనం మనసులో అదే భరోసా. ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాధించిన విజయమిది. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారు. మళ్లీ 2024లోనూ అదే నినాదంతో మేనిఫెస్టోను ప్రకటించారు. తాజా మేనిఫెస్టోపై అన్ని వర్గాల వారు ఆనందం వ్యక్తం చేశారు. చెప్పారంటే.. చేస్తారంతే అంటూ కొండంత నమ్మకముంచారు. మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీ జగనన్న నిలబెట్టుకుంటాడని అంచంచల విశ్వాసం ప్రదర్శించారు.

చెప్పారంటే... చేస్తారంతే

జగనన్ననే నమ్ముతారు..



అమ్మ ఒడి పెంచుతామని వైఎస్ జగన్ ప్రకటించారు. నాలుగేళ్లుగా అమ్మ ఒడి అందుకుంటున్న వారంతా జగనన్నను నమ్ముతారు. చంద్రబాబు చెప్పే కల్లబొల్లి కబుర్లు జనం నమ్మరు. మా లాంటి తల్లిదండ్రులం రాష్ట్రవ్యాప్తంగా జగనన్నకు రుణపడి ఉంటాం.

- కొర్ల శిరీష, వీరభద్రాపురం, పలాస మండలం

జగన్ హామీలు నెరవేరుస్తారు..



ఎన్నికల హామీలను వైఎస్ జగన్ కచ్చితంగా నెరవేరుస్తారు. చంద్రబాబు ఎప్పుడూ ఇచ్చిన మాటలన్నీ గాలికి వదిలేస్తారు. పింఛన్ మొత్తాన్ని దశలవారీగా పెంచుతామని వైఎస్ జగన్ ప్రకటించడం ఆనందంగా ఉంది.

- కోటిపల్లి సింహాద్రి, వృద్ధాప్య పింఛన్‌దారు, కొత్తూరు

చిరు వ్యాపారులకు ఊరట



ప్రతి రోజు రోడ్డు పక్కన తోపుడు బండ్లు వేసుకుని వ్యాపారం చేసే చిరు వ్యాపారులకు గత మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం రూ.10వేలు వేశారు. ఈ మేనిఫెస్టోలో రూ.15 వేలు చేస్తానని చెప్పారు. ఇది చిరు వ్యాపారులకు ఊరటనిస్తుంది. వైఎస్ జగన్‌పై అందరికీ నమ్మకం ఉంది.

- కాళ్ల సింహాచలం, ధర్మలక్ష్మిపురం, సారవకోట మండలం

జగనన్న చెబితే జరుగుతుంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పినట్లు తప్పకుండా అమలు జరుగుతుంది. జగనన్న చెబితే అది జరిగి తీరుతుందనే నమ్మకం మాకు ఉంది. ప్రతి నెలా ఇంటి వద్దకే పింఛన్ అందిస్తామని చెప్పి ఇంటి వద్దకే తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. పింఛన్ రూ. 3500 పెంచుతామని ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది.

- తమ్మినేని సత్యనారాయణ, పింఛన్‌దారుడు, కట్యాచార్యులపేట గ్రామం, ఆమదాలవలస మండలం

నైపుణ్యం పెరుగుతుంది



సీఎం వైఎస్ జగన్ తన మేనిఫెస్టోలో చెప్పినట్టు ప్రతి జిల్లాలో స్కిల్ కాలేజీ, ప్రతి నియోజకవర్గానికి స్కిల్ హబ్ ఏర్పాటు ద్వారా యువతలో నైపుణ్యం పెరుగుతుంది. నైపుణ్యం వుంటే అవకాశాలు అవే వెతుక్కుంటూ వస్తాయి. వైఎస్ జగన్ హామీ ఇస్తే తప్పకుండా అమలు చేస్తారు.

- గురివిల్లి విద్యాధర్‌రావు, యువకుడు, సుసరాం



ఆమదాలవలస: స్పీకర్ తమ్మినేని సీతారాం ఊరూరా జోరుగా ఎన్నికల ప్రచారాలు చేస్తున్నారు. పట్టణంలోని వెంగళరావు కాలనీలో ఇలా అనుచరులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు.



గార: మంత్రి ధర్మాన పల్లెల్లో కలియతిరుగుతున్నారు. బూరవెల్లిలో ఓటర్లను ఉద్దేశించి ఇలా మాట్లాడారు.



కొత్తూరు: ఎమ్మెల్యే రెడ్డి శాంతి గిరిజనానికి దగ్గరవుతున్నారు. శ్రీరాముల గూడలో ఇలా అందరితో కలిసిపోయి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.



సంతబొమ్మాళి: ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రచార రథంతో గ్రామాలన్నీ చుట్టేస్తున్నారు. నౌపడలో ఎన్నికల పరిశీలకులు కాయల వెంకటరెడ్డితో కలిసి ఊరంతా ప్రచారం చేశారు.

ప్రచార పర్వం

కొత్త రీతుల్లో..

అనుచరులతో ర్యాలీలు, ఆడపడుచులతో సంభాషణలు, బడుగు వర్గాల వారికి భరోసాలు, ఇంటింటికీ తిరుగుతూ కర పత్రాల పంపిణీలు.. ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. ఎక్కడికక్కడ వినూత్న రీతుల్లో నాయకులు ప్రచారాలు కొనసాగిస్తున్నారు.



కాశీబుగ్గ: మంత్రి సీదిరి అప్పలరాజు ప్రజాశీర్వాదాలు అందుకుంటున్నారు. మందస మండలం పిడిమందసలో ఇలా ఆడపడుచులు పూలమాలలు వేసి ఊరిలోకి ఆహ్వానించారు.



సారవకోట: ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మారుమూల పల్లెలకు వెళ్తున్నారు. సారవకోట మండలంలోని తొగిరిలో ఇలా స్థానికులను కలిసి ప్రచారం చేశారు.



ఇచ్ఛాపురం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. లాలాపేటలో ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి కర పత్రాలు వంచిపెట్టారు.



జి.సిగడాం: ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సామాన్యులతో మమేకమవుతున్నారు. ఎస్పీఆర్‌పురం, నడిమివలస గ్రామాల మధ్యలో వడ్రంగి పనులు చేస్తూ ఇలా ధైర్యం చెప్పారు.

క్లుప్తంగా

డిగ్రీ మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం విడుదల చేశారు. ఫలితాలు జ్ఞానభూమిలో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. పరీక్షకు 1462 మంది హాజరు కాగా 606 మంది ఉత్తీర్ణత సాధించారు. బీఎస్సీలో 1141 మందికి 469 మంది, బీఏలో 162 మందికి 57 మంది, బీకాం (ఒకేషనల్)లో 80 మందికి 40 మంది, బీకాం(జనరల్)లో 78 మందికి 40 మంది ఉత్తీర్ణత సాధించారు. 15 రోజుల్లోగా రీవేల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని డీన్ సూచించారు.

భువనేశ్వరి వ్యాఖ్యలు దారుణం



మాట్లాడుతున్న పడపాన సుగుణారెడ్డి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి దళితులను దుర్భాషలాడటం దారుణమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు పడపాన సుగుణారెడ్డి అన్నారు. శ్రీకాకుళం టౌన్‌హాల్‌లో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దళితులను కించపరుస్తూ మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు సైతం ఎవరైనా ఎస్సీ కులంలో పుట్టాలనుకుంటారా అని చేసిన వ్యాఖ్యలు ఆయనలో పెత్తందారీ దురంహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సైతం కొరపాన కళ్యాణిపై దాడి చేసిన ఘటనలు చూస్తే టీడీపీ నాయకులు దళితుల పట్ల ఎంత చిన్నచూపు చూస్తున్నారో తెలుస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో దళితులు టీడీపీకి ఓట్లతో బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో గుంట జ్యోతి, యామిజాల గాయిత్రీ తదితరులు పాల్గొన్నారు.

లగేజ్ వ్యాన్ ఢీకొని యువకుడు దుర్మరణం



ఓందత్తకుమార్ మృతదేహం

గార: మండలంలోని తూలుగు జంక్షన్ సమీపంలో ఓ రైసు మిల్లు వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గార గ్రామానికి చెందిన ఎం.ఓందత్తకుమార్ (19) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓందత్తకుమార్ స్వగ్రామం నుంచి శ్రీకాకుళం బైక్‌పై వెళ్తుండగా.. ఎదురుగా శ్రీకాకుళం నుంచి కొర్ని వెళ్తున్న మినీ లగేజీ వ్యాన్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓందత్తకుమార్‌కు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి తండ్రి రమణమూర్తి, సోదరుడికి ఫోన్ చేసి సమాచారమివ్వగా వారు వచ్చి రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె.కృష్ణప్రసాద్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



లక్ష్మణరావు(ఫైల్)

నరసన్నపేట: మండలంలోని నడగాం గ్రామానికి చెందిన తమరాపు లక్ష్మణరావు(40) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లిన లక్ష్మణరావు ఓ ప్రయివేటు కంపెనీలో లైన్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధి నిర్వహణలో ఎల్‌సీ తీసుకోవడంలో జరిగిన పొరపాటు కారణంగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం విషయం తెలియడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. లక్ష్మణరావుకు భార్య పద్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్ష్మణరావు మృతి పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు లుకలాపు రవి సంతాపం వ్యక్తం చేశారు.



చెప్పారంటే... చేస్తారంతే

హామీలన్నీ నెరవేర్చారు



ఐదేళ్ల ముందు వైఎస్సార్ సీపీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చింది. ఈ మేనిఫెస్టోలోనూ మహిళల ప్రగతికి చోటు ఇచ్చారు. ఇది మహిళలకు ఎంతో భరోసా ఇస్తుంది.

– జల్లు సుజాత, డ్వాక్రా సభ్యురాలు, పెద్దజల్లుపుట్టుగ, కవిటి మండలం

డ్రైవర్లకు భరోసా..



వాహన మిత్ర కొనసాగిస్తామని చెప్పడం ఆనందంగా ఉంది. రూ. 3 లక్షల లోపు రుణానికి వడ్డీ ప్రభుత్వమే భరిస్తుందని చెప్పడం కూడా సంతోషదాయకం. సొంత టిప్పర్, లారీ నడిపేవారికి వాహనమిత్ర వర్తింపజేస్తున్నట్లు మేనిఫెస్టోలో ప్రకటించడం బాగుంది. జగనన్న చెప్పారంటే చేస్తారు.

– పాలకొండ దానయ్య, ఆటో డ్రైవర్, పాలకొండ పేట, నరసన్నపేట

తండ్రి పంథాలోనే తనయుడు



దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రైతుల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేసేవారు. జగన్ సైతం అదే పంథాను అనుసరిస్తున్నారు. ఇచ్చిన మాటలన్నీ నిలబెట్టుకుంటున్నారు. మేనిఫెస్టోలో రైతుభరోసా రూ.16వేలకు పెంచి తన ప్రభుత్వానికి వ్యవసాయం అత్యంత ప్రాధాన్యం అని చెప్పకనే చెప్పారు.

– మిరబ్బిల్లి అప్పలనాయుడు, రైతు, డీఎల్‌పురం.

పండుటాకులకు జగనే అండ



జగన్ బాబు మా లాంటి పేదలకు ఎన్నో చేస్తున్నాడు. మా ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా పింఛను అందిస్తున్నాడు. పింఛన్ రూ.3వేలుతో ఇంటి అవసరాలు తీరుతున్నాయి. ఏటా ఈ మొత్తాన్ని పెంచుతామని చెప్పడం సంతోషం. మా పండుటాకులకు ఎంతో చేయూతను ఇస్తున్నారు.

– ముచ్చేటి నాగేశ్వరరావు, పింఛన్ లబ్ధిదారుడు, తిలారు రైల్వేస్టేషన్

మాటకు కట్టుబడిన నాయకుడు జగన్



సీఎం రైతు పక్షపాతి అని మళ్లీ నిరూపించుకున్నారు. కొత్త మేనిఫెస్టోలో రైతు భరోసాను రూ.13,500 నుంచి రూ.16 వేలకు పెంచారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న నాయకుడు సీఎం వైఎస్ జగన్.

– ఆర్.అంజనేయులు, రైతు, తెలినీలాపురం, టెక్కలి మండలం.

వైఎస్సార్ సీపీ వెంటే మేమంతా..



కాశీబుగ్గ: పార్టీలో చేరిన యువకులతో మంత్రి సీదిరి అప్పలరాజు

- టీడీపీని వీడిన నాయకులు, కార్యకర్తలు
- కండువాలు వేసి ఆహ్వానించిన అధికార పార్టీ నేతలు

కాశీబుగ్గ : వైఎస్సార్ సీపీలోకి చేరికలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వీరందరికీ అధికార పార్టీ నేతలు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానిస్తున్నారు. మందస, పలాస మండలాలకు చెందిన సుమారు 300 మంది యువకులు శనివారం పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో మందసకు చెందిన మహేష్, యోగేశ్వరరావు, మని జట్టు సభ్యులు, పూర్ణబద్రకు చెందిన చిరంజీవులు, బ్రాహ్మణతర్లాకు చెందిన మణి, రెంటికోటకు చెందిన రమేష్ సంతులు, పెదంచలకు చెందిన హర్షదయ్ తదితర 300 మంది ఉన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీవీ గ్రూప్ అధినేత తమలంపూడి శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకుడు హనుమంతు వెంకటరావుదొర, నాయకులు సాగరాన వినోద్‌కుమార్, తమ్మినాన శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మందస మండలం బాహడపల్లికి చెందిన టీడీపీ యువ నాయకుడు సార రవియాదవ్ వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి అప్పలరాజు స్వయంగా రవియాదవ్ నివాసానికి వెళ్లి కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వన యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్, పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున సూర్యారావు, వైస్ ఎంపీపీ ఎస్.ప్రసాద్, సర్పంచ్ బి.ఉమాపతి, క్లస్టర్ ఇన్‌చార్జి డి.హరికృష్ణ, ఏజీకే చైర్మన్ బి.చిన్నారావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని మర్రిపాడు పంచాయతీలో టీడీపీకి చెందిన 50 కుటుంబాల వారు ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో అట్టాడ శ్యామసుందరరావు, బడ్డ మల్లేష్, గిన్ని భీమారావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలవసంతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కోత సతీష్, పార్టీ నాయకులు దశరథ్‌రెడ్డి, అంగ అప్పారావు, అట్టాడ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

సారవకోట: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన 25 కుటుంబాల వారు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రెడ్డి శ్రీరాములు, జగ్గారావు, వేణుగోపాలరావు, శ్రీనివాసరావు, పట్ట జగదీష్, గొండు రఘుపతిరావు, బొంగు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ నక్క తులసీదాస్, సర్పంచ్ బాడాన కృష్ణారావు, బాబూరావు మాజీ సర్పంచ్ పల్లి కృష్ణారావు, పార్టీ నాయకులు వెలమల సింహాచలం, నిక్కు రాజశేఖర్, మెండ రామకృష్ణ తదితరులున్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని మతలబుపేటలో టీడీపీకి చెందిన 15 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు సనపల తవుడు, వీరఘట్టపు కృష్ణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి స్పీకర్, ఆమదాలవలస ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గురుగుబెల్లి రాంబాబు, గురుగుబెల్లి గోవిందరావు, పైల రాజు, సనపల రాజు, పొందూరు రమణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీలు శివానందమూర్తి, అనిల్, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కావిలాపు చంద్రశేఖర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, మండల సచివాలయం కన్వీనర్ అత్తులూరి రవికాంత్, సర్పంచ్ వీరఘట్టపు జయలక్ష్మి, పేడాడ చిరంజీవరావు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని మరువాడ పంచాయతీలో టీడీపీకి చెందిన 9 కుటుంబాలు, లావేరు మండలం తామాడ పంచాయతీలో 25 కుటుంబాల వారు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మునకాల రాంబాబు రెడ్డి, ఎస్.అప్పారావు, బోనెల రాంబాబు, సకలాబత్తుల నాగరాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మరువాడ సర్పంచ్ జక్కంపూడి అచ్చిబాబు, నాయకులు నడుపూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 16వ వార్డు లాలాపేటలో మాజీ కౌన్సిలర్ రేణుకారాణి పాత్రో, కృష్ణారావు పాత్రో దంపతులతో పాటు 50 కుటుంబాల వారు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని 3వ వార్డు అమీన్‌సాహెబ్‌పేటలో మాజీ కౌన్సిలర్ సాలిన రేవతి, సాలిన మామయ్య దంపతులతో పాటు 100 కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యేలు పిరియా సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్వాలా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, ఏఎంసీ చైర్మన్ బాబూరావు, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, జేసీఎస్ అధ్యక్షుడు సాలిన డిల్లీ, వార్డు కౌన్సిలర్లు ఎస్.ప్రేమ్ కుమార్, పి.మధుమూర్తి, బి.జగన్, నీలాపు లక్ష్మి, సీహెచ్ జగన్నాయకులు, పార్టీ నేతలు పిలక సంతు, పరపటి కోటిరెడ్డి, చాట్ల తులసీదాస్, నీలాపు డిల్లీ, చాట్ల తిరుపతి, టెంక లోకేష్, కాళ్ల సత్యం, దేవ, బొండాడ మహేష్, సల్లా దేవరాజు, నారాయణ, గాంధీ, కిరణ్ బెహరా పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: అరసవెల్లికి చెందిన 200 కుటుంబాలు, శాంతినగర్‌కు చెందిన మరో 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆయన తనయుడు రామ్‌మనోహర్‌నాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో శ్రీశయన వీధికి చెందిన గంటల కృష్ణవేణి, రాయిపల్లి విజయ, ఉంకుల ప్రసాద్, ఉంకుల మాధవ, దాడి సంతు, దాడి గిరి, గురు రాజు, వాడాడ సురేష్, గంట్ల సత్యన్నారాయణ, యాళ్ల ఆర్య, నెయ్యిల సూరిబాబు, బత్తెల రమేష్, పితాపురం హరికృష్ణ, బరాటం సత్యారావు, అప్పలరాజు, చల్ల శ్యామ్, చింతనిప్పుల రవి, బూరగావు మహేశ్వరరావు, జనార్దనరావు, వాడడ రవి. పొన్నాడ రవి, బంటుపల్లి కృష్ణ, గొర్లె రామారావు తదితరులు ఉన్నారు.



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



రణస్థలం: పార్టీలో చేరిన మరువాడ టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

వైఎస్సార్‌సీపీలో వంద కుటుంబాల చేరిక

కొత్తూరు: మండలంలోని ఓంద్రుజోలకు చెందిన 100 టీడీపీ కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కండవాలను వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ రాములు నాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నిమ్మగడ్డ కృష్ణారావు, సేనాపతి సత్యనారాయణ, గంధవరపు మోహన్‌రావు, భామిడి చిన్నారావు, నిమ్మగడ్డ వరహాలు నాయుడు, కొట్టేట చిన్నారావు తదితరులు ఉన్నారు. పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఓంద్రుజోల సర్పంచ్ గందవరపు నాగేంద్ర, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన ఇండిపెండెంట్ అభ్యర్థి



పైడి శ్రీనివాసరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ సుబ్బారెడ్డి

రణస్థలం: వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సమష్టిగా పనిచేసి పార్టీ గెలుపునకు తోడ్పాటు అందిస్తామని రణస్థలం మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పైడి శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల పార్టీకి దూరంగా ఉండి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన శ్రీనివాసరావు శనివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సారథ్యంలో రాజ్యసభ సభ్యుడు, రీజనల్ కోర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడేవాళ్లకు సముచిత స్థానం ఉంటుందని చెప్పారు. శనివారం అనకాపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్: పార్టీలో చేరిన వారితో మంత్రి ధర్మాన ప్రసాదరావు, రామ్‌మనోహర్‌నాయుడు



ఇచ్ఛాపురం: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు



సారవకోట: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



సరుబుజ్జిలి: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో స్పీకర్ తమ్మినేని సీతారాం



కాశీబుగ్గ: వైఎస్సార్ సీపీలోచేరిన సార రవియాదవ్‌తో మంత్రి అప్పలరాజు



సంతబొమ్మాళి: టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



ఇచ్ఛాపురం: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యేలు పిరియా సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్వాలా

బంగారం కోసం వృద్ధురాలి హత్య?

- మూడు రోజుల కిందట అదృశ్యమై డ్రైనేజీలో శవమై తేలిన వైనం
- అనుమానితురాలిని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు
- అమలపాడులో విషాదం

వజ్రపుకొత్తూరు: మండలంలోని అమలపాడులో ఓ వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతిచెందింది. మృతురాలు ధరించిన సుమారు 10 తులాల బంగారం కోసం అదే గ్రామానికి చెందిన ఓ మహిళే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అమలపాడు గ్రామానికి చెందిన దున్న ఎర్రన్న భార్య దున్న దమయంతి (60) ఈ నెల 24న టిఫిన్ చేసేందుకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాలు, బంధువల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామంలోని షిరిడీ సాయిబాబా మందిరానికి ఎదురుగా ఉన్న మూతబడిన డ్రైనేజీ నుంచి దుర్వాసన వస్తున్నట్లు అక్కడ పనిచేస్తున్న తాపీమేస్త్రీలు గుర్తించారు. విషయం వజ్రపుకొత్తూరు పోలీసులకు తెలియజేయడంతో ఎస్ఐ రామారావు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం దున్న దమయంతిదే కావడంతో కుమారులు కృష్ణారావు, రామారావు, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. తన తల్లి ధరించిన పది తులాల బంగారం కనిపించకపోవడంతో వాటి కోసమే హత్య జరిగి ఉంటుందని పోలీసులకు తెలియజేశారు.

ఆమె పనేనా..

కాగా వృద్ధురాలి హత్య వెనుక ఇదే ప్రాంతంలో నివాసముంటున్న ఓ మహిళ హస్తమున్నట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. వృద్ధురాలు అదృశ్యమైన రోజు సదరు మహిళ ఆమె వద్దకు వెళ్లినట్లు కొందరు గుర్తించారు. మృతదేహం బయటపడటంతో వెంటనే ఆమెను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతురాలి కుమారుడు కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సీహెచ్.రామారావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు జరుగుతుందని ఎస్ఐ తెలిపారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని చెప్పారు. కాగా మృతురాలి మృతదేహాన్ని తీసేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో వజ్రపుకొత్తూరు ఎస్ఐ సీహెచ్. రామారావు తానే స్వయంగా డ్రైనేజీలోకి దిగారు. చనిపోయి మూడు రోజులు కావడంతో ఓ వైపు దుర్వాసన వెదజల్లుతున్నా ధైర్యంగా మృతదేహం వెలికితీసి గాయాలు పరిశీలించారు.



దున్న దమయంతి (ఫైల్)



మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఎస్ఐ రామారావు